క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈశ్వరిదేవికి సారె



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో నిర్వహించనున్న ఈశ్వరిదేవి ఆరాధన మహోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివెళ్లారు. గురువారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సారెను కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ సత్యనారాయణపురంలోని విశ్వబ్రాహ్మణ మహిళ సంఘాన్ని సందర్శించి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కల్లూరి శ్రీవాణి అధ్వర్యంలో ఈశ్వరిదేవి అమ్మవారి ఆరాధనకు పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి సారె సమర్పించడం ఎంతో పుణ్యకార్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు నవతా, చైతన్య, లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు జనవరి నెలలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ అండ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజరేషన్ రిపేరింగ్, ఐస్‌క్రీమ్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారు చేయడం, బాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, మిర్రర్ వర్క్ మొదలైన అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిత ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా జ్యోతి



కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా కసగోని జ్యోతి నియమితులయ్యారు. కృష్ణలంక, 21వ డివిజన్‌కు చెందిన ఈమెను ప్రభుత్వం రెండోసారి డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి డైరెక్టర్ పదవిలో నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు, పార్టీ పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల ప్రజలను, మహిళలను చైతన్య పరిచి పార్టీ గెలుపునకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు.

'హిట్ అండ్ రన్' చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయతలపెట్టిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆల్ ఆంధ్రా లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబురావు, షేక్ మసూద్ ఆలీ డిమాండ్ చేశారు. స్థానిక విజయవాడరోడ్డులోని అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీ డ్రైవర్లు, క్లీనర్లు గురువారం శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. 'హిట్ అండ్ రన్' చట్టంతో లారీ డ్రైవర్ల జీవితాలు అంధకారంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ అసోసియేషన్ తరుపున వినతి పత్రాన్ని పంపుతున్నట్లు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నవాబుపేట(పెనుగంచిప్రోలు): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వారి శ్రీవారి ట్రస్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ,, బీసీలు నివసించే ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వవిప్, టీటీడీ పాలకవర్గ సభ్యుడు సామినేని ఉదయభాను తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ వారి నిధుల రూ.10 లక్షలతో నవాబుపేటలో తలపెట్టిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఒక్కో ఆలయానికి రూ.10లక్షలు చొప్పున 32 ఆలయాలకు రూ.3.20 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు తదితరులున్నారు.





భవానీమాతాకీ జై..

భవానీల దీక్ష విరమణతో దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం రద్దీగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచి గురువారం రెండో రోజు వేలాది మంది భవానీలు తరలివచ్చి ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించారు. చిన్నారులు సైతం ఇరుముడులతో కొండకి చేరుకున్నారు. భవానీమాతాకి జై అంటూ దీక్షాపరులు అమ్మవారిని స్మరించుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







అభివృద్ధికి దిక్సూచి పశ్చిమ నియోజకవర్గం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గం అంటే అభివృద్ధికి దిక్సూచి అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం 42,43 డివిజన్ల పరిధిలో రూ.1.18 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రోడ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రెండు డివిజన్లలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి అభివృద్ధిలో తేడా గమనించాలని కోరారు. ఎన్నికల నాటికి అన్ని రోడ్లు నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. స్వాతంత్ర్య వచ్చిన తర్వాత పశ్చిమ పరిధిలో 11 వాటర్ ట్యాంకులు ఉన్నాయని, ఈ నాలుగున్నరేళ్లలోనే 11 కొత్త వాటర్ ట్యాంకుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. వాటిలో కొన్నింటికి శంకుస్థాపనలు చేశామని, మరికొన్ని నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయన్నారు. పార్కులను అభివృద్ధి చేశామన్నారు. పిల్లలకు ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. స్టేడియం కూడా శరవేగంగా నిర్మాణం జరుగుతోందన్నారు. చంద్రబాబు హయాంలో జరగని అభివృద్ధి, నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో చేసి చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 42,43 డివిజన్ల కార్పొరేటర్లు పడిగపాటి చైతన్య రెడ్డి, బాపతి కోటి రెడ్డి, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే పార్థసారథి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, పక్కన తోట శరత్‌చంద్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): బలహీనవర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం విజయవాడ శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో ఉచితంగా ఇస్తున్న ఏపీపీఎస్సీ గ్రూప్ 1 శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పెనమలూరు శాసన సభ్యులు కొలుసు పార్థసారథి అన్నారు. గ్రూప్ 1 ఉచిత శిక్షణకు సంబంధించి శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ముద్రించిన పోస్టర్‌ను గురువారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్‌లు జారీ చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ కూడా గ్రూప్ 1 పరీక్షను సివిల్స్ స్థాయిలో పెట్టడం, నోటిఫికేషన్లను అనుకున్న సమయంలోనే పారదర్శకంగా పూర్తి చేస్తూ, మిగిలిన రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని యువతకు అవసరమైన శిక్షణ తన సొంత ఖర్చుతో ఉచితంగా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాల్లో సహాయం చేయడానికి తామెప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ తమ అకాడమీలో గత మూడు సంవత్సరాల్లో 98 కిపైగా గ్రూప్ 1 ర్యాంకులు వచ్చినట్లు తెలిపారు. గ్రూప్1 పరీక్ష కూడా ఐఏఎస్ తరహాలో జరుగుతుందన్నారు.

మహిళల జీవనోపాధిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): చైల్డ్ ఫండ్ ఇండియ హెచ్‌ఎస్‌బీసీ సహకారంతో విజయవాడ అర్బన్ ప్రాంతాలైన వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట, వైఎస్సార్ కాలనీ, కండ్రికలలోని మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా జీవనోపాధి పొందేందుకు గురువారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న సుమారు 1210 మంది మహిళలకు రూ.12 వేలు చొప్పున అందచేసి చిరు వ్యాపారాలు చేసుకునేందుకు సహకరించారు. వారి వ్యాపారాభివృద్ధి కోసం నిర్వహించిన 18 రోజుల శిక్షణలో వ్యాపార పరిజ్ఞానం, నెట్ వర్కింగ్, లింకేజిలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా సీనియర్ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ స్లమ్ ఏరియాలో ఉన్న మహిళల అభివృద్ధికి తమ సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. తద్వారా ఉమెన్ ఎంట్రపెన్యూర్స్ పెంపొందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శిక్షకులు మంజూషా, అశ్విని, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఐడియా.. అదిరింది...



చిన్నారి షర్టు జేబుపై ఫోన్ నంబరు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షలలో తల్లిదండ్రుల నుంచి చిన్నారులు తప్పిపోవడం సర్వ సాధారణం... అయితే దసరా ఉత్సవాలలో చిన్నారుల చేతికి పోలీసులు ట్యాగ్ వేసి దానిపై తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ వేస్తారు.. అయితే కొన్ని సందర్భాల్లో ఆ ట్యాగ్‌లు చిరిగిపోయే అవకాశం ఉండేది.. అయితే గురువారం ఓ తండ్రి తన కుమారుడికి తన ఫోన్ నెంబర్ తెలిసేలా చేసిన ఐడియా అదిరిపోయింది. కుమారుడు షర్టుపై పర్మినెంట్ మార్కర్ ఇంక్‌తో తన ఫోన్ నెంబర్ వేశాడు. కుమారుడు పొరపాటున తప్పిపోయినా... ఎవరికైనా దొరికితే వారి చేత ఈ ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయమని చెప్పాలని ఆ బిడ్డకు చెప్పాడు. ఈ ఐడియా అదిరిపోయిందంటూ తోటి భవానీలు, పోలీసులు ఆ తండ్రిని మెచ్చుకున్నారు.

ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు సమన్యాయం చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న దాసరి సువర్ణ రాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో మాదిగలకు న్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణ రాజు కోరారు. విజయవాడ ఐలాపురం హోటల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 29 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15 సీట్లు మాదిగ, మాదిగ ఉప కులాలకు కేటాయించాలని కోరారు. మాదిగల జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలను మాలలకు కాకుండా మాదిగలకే కేటాయించాలన్నారు. ఈ ప్రభుత్వంలో సీట్ల కేటాయింపులో మాదిగలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 20వ తేదీన వైఎస్సార్ కడప మున్సిపల్ గ్రౌండ్‌లో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మాదిగల రాజకీయ సమన్యాయ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కుందుర్తి సుబ్బారావు, ఎంఈఎఫ్ అధ్యక్షులు వరదరాజులు జాతీయ నాయకుడు ఏసు పోగు బాబు, నెల్లూరు జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

13 నుంచి పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ఆలయ చైర్మన్ భాను ప్రదీప్, ఈఓ లోకేశ్వరి తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 13వ తేదీ నుంచి సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా సంక్రాంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న పసుపు, కుంకుమ నూతన వస్త్రాల బహుకరణ అనంతరం పేరంటాలమ్మ పుట్టింటి నుంచి ఆలయానికి చేరుకుంటారన్నారు. 13న భోగి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడులు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14 మకర సంక్రాంతిన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, కుంకుమ పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. అదే రోజు సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తామన్నారు. 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి(ఊయల) సేవ, 20న ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా జరిగే గ్రామోత్సవానికి సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో క్యూలైన్లు, తాగునీటి వసతి, మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, భక్తులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మత్తె కిరణ్ తదితరులున్నారు.

భవానీలకు అల్పాహారం పంపిణీ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గిరి ప్రదక్షిణ చేసే భవానీలకు అల్పాహారం, పాలు, పండ్లు పంపిణీ చేయడం అమ్మవారి సేవతో సమానంగా భావిస్తున్నామని చిట్టినగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు బత్తిన రాఘవ, రఘువీర్ తెలిపారు. భవానీల ఇరుముడులను పురస్కరించుకుని గిరి ప్రదక్షణ చేసే భవానీలకు బత్తుల లలితా ప్రసాద్ పేరిట సేవా కార్యక్రమాలను గురువారం నుంచి ప్రారంభించారు. కేటీ రోడ్డుపై ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ మూర్తికి రాఘవ, రఘువీర్ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం భవానీలకు అల్పాహార పంపిణీ చేశారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవారు జాము వరకు అల్పాహారం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. దీక్ష విరమణల చివరి మూడు రోజులు భవానీలకు అల్పాహారం, కాఫీ, టీలతో పాటు పండ్లను పంపిణీ చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఏటా భవానీలకు సేవ చేసుకునే భాగ్యం కలగడం చాలా సంతోషంగా ఉందని నిర్వాహకులు కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలుగు సాహిత్యానికి సోమేపల్లి విశేష కృషి



పాలస్తీనా సేచ్ఛకై గళమెత్తుదాం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



ప్రదర్శనలో పుస్తకాలు తిలకిస్తున్న ప్రజలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సోమేపల్లి వెంకట సుబ్బయ్య తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేశారని కవి చలపాక ప్రకాష్ కొనియాడారు. విజయవాడ పుస్తకమహోత్సవం ఆవరణలోని కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్యవేదికపై సోమేపల్లి వెంకట సుబ్బయ్య సంస్మరణ సభ గురువారం జరిగింది. ప్రకాష్ మాట్లాడుతూ కవిగా తన సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించి, సంపాదకుడుగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య తెలుగు యువ కవులకు అండగా నిలిచారని తెలిపారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సంస్థ అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు, పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షులు మనోహర్ నాయుడు, సభ్యులు బోడి ఆంజనేయరాజు, శ్రీవశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలి...

ప్రపంచంలో అమెరికా చేస్తున్న దురాగతాల గురించి తెలుసుకోవాలంటే ప్రజలంతా పాలస్తీనా సమస్యపై వాస్తవాలు తెలుసుకోవాలని సాహితీవేత్త బుడ్డిగ జమీందార్ అన్నారు. ఎన్. వేణుగోపాల్ రాసిన పాలస్తీనా స్వేచ్ఛకై గళమెత్తుదాం, సీఎస్సార్ ప్రసాద్ రాసిన మండిస్తూ మండే గాజా, జీవీ.సత్యనారాయణమూర్తి రాసిన నేల లేని దేశం అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ గురువారం పుస్తకమహోత్సవంలో గురువారం జరిగాయి. ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించిన సందర్భంగా జమీందార్ మాట్లాడుతూ గత మూడున్నర నెలలుగా ఇజ్రాయిల్ పాలస్తీనాల మధ్య జరుగుతున్న ఘోర యుద్ధంపై మేధావుల అభిప్రాయాలను ఈ పుస్తకాలు రికార్డు చేసి ప్రజల ముందుకు తెచ్చారన్నారు. భారతీయులంతా పాలస్తీనీయులకు మద్దతివ్వాలని కోరారు.

హిందీలోకి అనువాదాలు పెరగాలి...

తెలుగు భాషలోని పుస్తకాలు ఇతర భాషల్లోకి ముఖ్యంగా హిందీలోకి అనువాదాలు జరగాలని ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. పుస్తకమహోత్సవం సాహిత్య అకాడమీ అవార్డు పొందిన దేవీప్రియ తెలుగు కవిత్వం 'గాలి రంగు' పుస్తకానికి హిందీ అనువాదం 'హవా కా రంగ్' పుస్తకాన్ని గురువారం సాయంత్రం పుస్తక మహోత్సవం ఆవరణలో లక్ష్మీ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో జరుగుతున్న అద్భుతమైన సాహిత్య సృష్టిని దేశమంతటికీ చేర్చాల్సిన బాధ్యత కూడా తెలుగువాళ్లే తీసుకోవాలన్నారు. హిందీ అకాడమీ అధ్యక్షుడు పేరిశెట్టి శ్రీనివాసరావు కవిత్వం తీరుతెన్నులు, భారతీయ కవిత్వంలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. కవి బండ్ల మాధవరావు సభకు అధ్యక్షత వహించారు. వెన్నా వల్లభరావు, కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు సభలో పాల్గొన్నారు.

నవ వధువుకు వేధింపులు

చిట్టినగర్: నవ వధువును వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. అంబాపురానికి చెందిన కుంచెం కావ్య గత ఏడాది కొత్తపేట ఆంజనేయవాగు ప్రాంతానికి చెందిన ఆనంద్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గత ఏడాది నవంబర్ 16వ తేదీన వీరి వివాహం జరిగింది. ఆటో నడుపుకుంటూ జీవనం చేసే ఆనంద్‌తో కావ్య వివాహం అత్త రమణకు ఇష్టం లేదు. కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నారని అత్త తరుచూ అనడంతో కావ్య తండ్రి అప్పు చేసి రూ. 50 వేలు ఇచ్చాడు. పెళ్లి అయిన కొద్ది రోజులకే ఆనంద్ తాగి వచ్చి కావ్యను వేధింపులకు గురి చేయడంతో పాటు అత్త రమణ, పెద్దత్త దుర్గ, ఆడపడుచు దివ్యలు వేధించడంతో బాధితురాలు ఫిర్యాదు చేసింది.